ప్రజాశక్తి

ఆదివారం 19 నవంబర్ 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

నిరుపయోగంగా లే అవుట్‌లు

- అందని ద్రాక్షగా ఇళ్ల స్థలాలు
- అయోమయంలో 50 వేల కుటుంబాలు
- రాజధానిలో ఇళ్ల నిర్మాణం నిలిపివేత
- లబ్ధిదార్లకు ప్రత్యామ్నాయం చూపని ప్రభుత్వం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతిలోని ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణం నిలిచిపోవడంతో 25 లే అవుట్‌లు నిరుపయోగంగా మారాయి. నాలుగు నెలలు దాటినా ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రత్యామ్నాయమూ చూపకపోవడంతో 50వేల మంది లబ్ధిదారులు అయోమయంలో చిక్కుకున్నారు. రాజధాని అమరావతి పరిధిలో గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాలకు చెందిన 50,793 మంది పేదలకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి మంగళగిరి మండలం కృష్ణాయపాలెంలో సిఎం జగన్ జులై 24న శంకుస్థాపన చేశారు. ఆగస్టు 8న హైకోర్టు ఇళ్ల నిర్మాణాన్ని నిలిపివేస్తూ స్టే ఉత్తర్వులు ఇచ్చింది. సిఆర్‌డిఎ చట్టం ప్రకారం ఇళ్లనిర్మాణం జరగడంలేదని హైకోర్టు అభిప్రాయపడింది. అయితే కోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వం ఇప్పటి వరకు కనీసం దిద్దుబాటుచర్యలు చేపట్టలేదు.

రాజధాని అమరావతిలో ఇళ్ల స్థలాలను ఈ ఏడాది మే 26న సిఎం జగన్ పంపిణీ చేశారు. అదేరోజు రాజధానిలో ఇళ్ల నిర్మాణానికి జులై 8న తాను శంకుస్థాపన చేస్తానని సిఎం జగన్ స్థలాల పంపిణీ సందర్భంగా వెంకటపాలెంలో జరిగినసభలో ప్రకటించారు. ఈమేరకు మే 26 నుంచి జులై మూడో తేదీవరకు అధికారులు హడావుడి చేశారు. ఇళ్ల నిర్మాణానికి కేంద్రం నిధులు ఇవ్వలేదు. స్థలాల పంపిణీ న్యాయవివాదాల్లో ఉండటంతో కేంద్రం నిధులు ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో జులై 8న జరగాల్సిన ఇళ్లనిర్మాణంను వాయిదా వేశారు. కేంద్రం నిధులు ఇవ్వకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే ఇళ్లు నిర్మించేలా ప్రతిపాదనతో శంకుస్థాపన చేయగా ఆగస్టు 3వ తేదీన కోర్టు ఉత్తర్వులతో ఈ ప్రక్రియ మొత్తం నిలిచిపోయింది. ఆర్-5 జోన్‌లో ఇళ్లనిర్మాణాన్ని హైకోర్టు తప్పుపట్టింది. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించినా ప్రభుత్వానికి సానుకూలత రాలేదు. సార్వత్రిక ఎన్నికల లోపు రాజధానిలో ఇళ్ల నిర్మాణం జరిగే పరిస్థితిలేదు. 50 వేల మంది లబ్ధిదారులకు రెండు జిల్లాల పరిధిలో ఇళ్ళ స్థలాలపై ఇప్పటివరకు ఎటువంటి ప్రత్యామ్నాయం చూపలేదు. దాదాపు రూ.250 కోట్లతో రూపొందించిన లేఅవుట్‌లలో మౌలిక సదుపాయాలు నిరుపయోగంగా మారాయి. మరో 100 రోజుల్లో సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు వచ్చే అవకాశం ఉండటం, ఈ లోగా 50 వేల మందికి ఇళ్ల నిర్మాణం ఎలా ఉన్నా,తమ జిల్లాల పరిధిలో స్థలాలు అయినా ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు. గతంలో జగనన్నకాలనీల్లో లబ్ధిదారులు నివశించే ప్రాంతాలకు కొంత దూరంలో స్థలాలు కేటాయించారు. కానీ గుంటూరు,ఎన్‌టిఆర్‌జిల్లాల వారిలో 50 వేలమందికి రాజధానిలో కేటాయిస్తామని 2020- 2021లో పెండింగ్‌లో ఉంచారు. పలు న్యాయ వివాదాల మధ్య ఈ ఏడాది మే నెలలో స్థలాల పంపిణీ చేసి ఇళ్ల నిర్మాణం ప్రారంభించకముందే హైకోర్టు స్టే ఉత్తర్వులు ఇవ్వడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఈ 50 వేల మందికి ఎప్పటికి ఇళ్ల స్థలాలు దక్కుతాయన్నదీ ప్రశ్నార్థకంగామారింది.

26 నుండి కులగణన

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల సంక్షేమానికి అవసరమైన పాలసీలను తయారు చేయడానికి కులగణన ఎంతో తోడ్పడుతుందని భావించి రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కులగణన-2023 చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.ఈనెల 26వ తేదీ నుండి వారం రోజులపాటు గుంటూరులో కులగణన చేయనున్నట్లు వెల్లడించారు. శనివారం స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కులగణన-2023పై స్టేక్ హోల్డర్లతో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ కులగణన ఏ రకంగా జరుగుతుంది? దీని ఆవశ్యకత గురించి వివరించారు. గతంలో 1931లో కులగణన జరిగిందని, ఇటీవల బీహార్ రాష్ట్రంలో కులగణన జరిగిందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వ పాలసీల రూపకల్పనకు కులగణన వివరాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కులగణన చేపట్టేందుకు ముందుగా జిల్లాలో ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, మేధావులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి, వారి సలహాలు స్వీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కులగణనకు ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా సచివాలయ సెక్రెటరీ, వాలంటీర్ వివరాలు సేకరిస్తారన్నారు. ప్రజలందరూ ఏ విధమైన అపోహలకు గురికాకుండా అత్యంత పారదర్శకంగా ఈ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు తమ వాస్తవ వివరాలు స్వచ్ఛందంగా తెలియజేయాలని, ఇందుకు ఎలాంటి ఆధారాలు అవసరం లేదని చెప్పారు. ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ అనేక సూచనలు చేశారు. ముఖ్యంగా చట్టబద్ధత కలిగిన ఉద్యోగులతో మాత్రమే కులగణన చేపట్టాలని, కులాలు, ఉప కులాలు వివరాలు తెలిసిన ఉద్యోగితో కులగణన చేపట్టాలని, ఇందుకు అనుభవం ఉన్న సిబ్బందితో కులగణన చేపట్టాలని, ఈ కులగణనపై గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కలిగేటట్లుగా ప్రచారం చేపట్టాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, సిపిఒ శేషశ్రీ, బీసీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి , కష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్ పర్సన్ కోలా భవానీ, విభిన్న ప్రతిభావంతులు సీనియర్ సిటీజన్ సహాయక కార్పొరేషన్ చైర్ పర్సన్ ముంతాజ్ పఠాన్, డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావు, ఆర్‌డిఒ పి.శ్రీఖర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు ఏటి అగ్రహారంలో రహదారిపై నిరసన తెలుపుతున్న టిడిపి శ్రేణులు

గుంతలు పూడ్చలేని అసమర్థ ప్రభుత్వం

టిడిపి, జనసేన ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో నిరసనలు

2లో

భరోసా ఇవ్వని సామాజిక బస్సు యాత్రలు

2లో

సీజ్ చేసిన పురుగుమందులు

239 లీటర్ల పురుగు మందులు సీజ్

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

అనుమతి లేకుండా ఇతర రాష్ట్రాల నుండి తరలిస్తున్న పురుగు మందులను వ్యవసాయ అధికారులు పట్టుకున్నారు. సత్తెనపల్లి మండలం కంటెపూడి వద్ద పురుగు మందులు రవాణా చేస్తున్న ఆటోను సత్తెనపల్లి ఎడిఎ ఎస్.శ్రీధర్‌రెడ్డి శనివారం పట్టుకున్నారు. బేయర్ కంపెనీ, ఎఫ్ఎంసి కంపెనీ పురుగు మందుల వారి ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టారు. గుంటూరు నుండి సత్తెనపల్లి పట్టణంలోని శ్రీరామ ఫర్టిలైజర్ షాపునకు వస్తున్న పురుగు మందుల ఆటోను కంటిపూడి వద్ద ఆపి తనిఖీ చేయగా

2లో



అప్పీల్సు విచారణకు చర్యలు

సమాచార హక్కు చట్టం కమిషనర్ శామ్యూల్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సమాచారహక్కు చట్టం ద్వారా గతేడాది కాలంలో 380 మంది అప్పీలుకు రాగా 20 ఫిర్యాదులశ్రీఅ విచారించి తీర్పును ఇచ్చినట్టు రాష్ట్ర సమాచార హక్కుచట్టం కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్ తెలిపారు. రాష్ట్ర కమిషనర్‌గా భాద్యతలు స్వీకరించి శనివారం నాటికి ఏడాది పూర్తయిన సందర్భంగా తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సమాచార హక్కు చట్టం కింద రెవెన్యూ, విద్య,నీటిపారుదల శాఖ, కార్మిక, గ్రామ, వార్డ్ వాలంటీర్స్, వక్ఫ్ బోర్డు, మైనారిటీ వెల్ఫేర్ శాఖలకు సంబంధించి రెండో అప్పీల్స్‌ను విచారించి తీర్పులిస్తామన్నారు. ఏడాది కాలంలో రాష్ట్ర సమాచార కమిషన్ వ్యవస్థాగతమైన రెండుకీలక సంస్కరణలు చేపట్టామని, సమాచార కమిషన్ ఇచ్చే నోటీసులు, ఉత్తర్వులు తెలుగు భాషలో ఇవ్వాలని నిర్ణయించామని అన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి ఆన్‌లైన్‌లో విచారించడానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు.

నరేంద్రపై కేసులో రోశయ్య హస్తం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సంగం డెయిరీపై కొంత మంది వ్యక్తులు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని డెయిరీకి చెందిన డైరెక్టర్లు ఆరోపించారు. ఈ మేరకు గుంటూరు నగరం అమరావతి రోడ్డులోని సంగం డెయిరీ కార్యాలయంలో డైరెక్టర్లు నర్రా వెంకట ప్రసాద్, కంచర్ల శివరామయ్య, వలివేటి ధర్మారావు విలేకర్లతో మాట్లాడారు. పాల ఉత్పత్తి దారులకు బోనస్ బకాయిలు చెల్లించలేదనేది వాస్తవం కాదన్నారు. ఏలూరు జిల్లాకు పెదవేగి మండలం జానంపేటకు చెందిన ముసునూరి రాము సంగం డెయిరీ మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఆయనకు డెయిరీ ఫాం లేదని అన్నారు. అన్ని జిల్లాల్లో ఒకే రకమైన బోనస్ విధానాన్ని అమలు చేస్తున్నామని, బోనస్ నెపంతో తమ సిబ్బందిపై సంగం డెయిరీ గేటు బయట ఘర్షణ పడిన ముసునూరి రాముతో ఎమ్మెల్యే కిలారి రోశయ్య ధూళిపాళ్ల నరేంద్రపై హత్యాయత్నం కేసులు పెట్టించారని ఆరోపించారు. ఆరు నెలల తరువాత తమ ప్రభుత్వం వస్తుందని అప్పుడు వారి పరిస్థితి ఏమిటో తెలుసుకోని మసలుకోవాలని హెచ్చరించారు.

239 లీటర్ల పురుగు మందులు సీజ్

(మొదటి పేజీ తరువాయి)

అనధికార నిల్వలను గుర్తించి సీజ్ చేశారు. బేయర్ కంపెనీకి చెందిన లాయిడ్స్ 80 పురుగు మందుల బాటిల్స్ ఎఫ్ఎంసి కంపెనీ చెందిన 230 లీటర్ల పురుగు మందులను సీజ్ చేశారు. వీటి విలువ రూ.3.20 వేలకుపైగా ఉంటుందని ఎడిఎ తెలిపారు. సీజ్ చేసిన పురుగు మందులు నుండి నాణ్యతా పరీక్షల నిమిత్తం ఒక్కొక్క బ్యాచ్ నుండి ఒకశ్యాపిల్ సేకరించి లాబ్‌కు పంపించినట్లు ఎడిఎ తెలిపారు.

సిఐడి చీఫ్ వ్యాఖ్యలపై తెలుగుయువత నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్తులతో పాటు సామాన్య ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని తెలుగు యువత జిల్లా అధ్యక్షులు రావిపాటి సాయి కష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేఖంగా పోస్టులు పెడితే సామాన్య ప్రజల ఆస్తుల సైతం అటాచ్ చేస్తామని సిఐడి చీఫ్ సంజయ్ కుమార్ బెదిరింపు వ్యాఖ్యలను ఖండిస్తూ వినూత్న రీతిలో తెలుగు యువత కార్యకర్తలు నిరసన తెలిపారు. ఆస్తుల పత్రాలను ట్రంకుపెట్టేలో పెట్టి గోతిలో పూడ్చి పెట్టుకోనే విధంగా నిరసన తెలిపారు. సాయి కష్ణ మాట్లాడుతూ గతకొంత కాలంగా సిఐడి విభాగం ప్రవర్తిస్తున్న తీరు సమాజంలో ఎన్నో అపోహలు భయాందోళనకు గురిచేస్తున్నదని సిఐడి చీఫ్ సంజయ్ కుమార్ పబ్లిక్ సెర్వెంట్ అన్నవిషయాన్ని గుర్తెరిగి పని చెయ్యాలె గాని ముఖ్యమంత్రి వద్ద స్వామి భక్తి కోసం భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తూ పౌరులను భయబ్రాంతులకు గురిచేసే విధంగా మాట్లాడుతున్నారని అన్నారు. రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్ మీరా బాబు ,జిల్లా ఉపాధ్యక్షులు గుత్తికొండ కిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'భరోసా' ఇవ్వని సామాజిక బస్సు యాత్రలు

వీక్షణం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సామాజిక సాధికారిక బస్సు యాత్రలు ప్రజలకు తగిన భరోసాను ఇవ్వలేకపోతున్నాయి. మూడు దశల్లో జరిగే ఈ యాత్రలు ఇప్పటి వరకు తెనాలి, పెదకూరపాడు, వినుకొండ, మాచర్ల, గుంటూరు తూర్పు, పొన్నూరు,బాపట్ల నియోజకవర్గాల్లో జరిగాయి. ఇప్పటి వరకు జరిగిన సభల్లో పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు,వైసిపి సమన్వయకర్తలు పాల్గొంటున్నారు. ఈ యాత్రల్లో ప్రజలను సమీకరించడానికి అధికార పార్టీ ఎమ్మెల్యేలు తంటాలు పడుతున్నారు. నాలుగున్నర ఏళ్ల తరువాత కూడా యాత్రల కోసం ప్రజలను సమీకరించడానికి చేస్తున్న ప్రయత్నాలు అంతా ఇంతాకాదు. డ్వాక్రా మహిళలు, పథకాల్లోని సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులు, వాలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులను బస్సు యాత్రలకు రావాలని ఎమ్మెల్యేలు హుకుం జారీ చేస్తున్నారు. ఈమేరకు వాహనాలను ఏర్పాటు చేసి గ్రామాల నుంచి పట్టణాలకు తరలిస్తున్నారు. తొలి సారిగా జరిగిన తెనాలిలో బస్సు యాత్రకు ప్రజా స్పందన లేదని వైసిపి అధిష్టానంకు నివేదికలు వెళ్లాయి. మిగతా సభలు కొంత వరకు మెరుగ్గా ఉన్నట్టు ఐ.ప్యాక్ బృందాలు నివేదించాయి. అన్నింటి కన్నా వినుకొండ, బాపట్ల, మాచర్ల, పొన్నూరు, పెదకూరపాడులో బస్సు యాత్రల్లో ప్రజలను సమీకరించడంలో ఎమ్మెల్యేలు సఫలీకృతులయ్యారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు ముందస్తు ప్రచారంగా ఈ బస్సు యాత్రలను నిర్వహిస్తున్నారు. అయితే అభివృద్ధి కార్యక్రమాల ప్రస్తావన తక్కువగా ఉంటోంది. సిఎం జగన్‌ను పొగడటం, ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై విమర్శలకే ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైసిపిని గెలిపించాలని కోరుతున్నారు. అయితే ప్రజా సమస్యల ప్రస్తావన ఉండటం లేదు. వీటి పరిష్కారం కోసం వేచి చూసే వారికి కూడా నిరాశ ఎదురవుతుంది. ప్రధానంగా జిల్లాలో రహదారులు అధ్వానంగాఉన్నాయి. సాగునీటి సరఫరా లేక రైతులు అల్లాడుతున్నారు. వర్షాభావంతో కరువు తీవ్రతగా ఈ అంశాల జోలికి మంత్రులు, ఎంపిలు,ఎమ్మెల్యేలు వెళ్లడంలేదు. జగనన్నకాలనీల్లో గృహ నిర్మాణాలు పూర్తికాకపోయినా వాటి గురించి ప్రస్తావించడంలేదు. వీటిని ఎలా పూర్తిచేయాలో కూడా భరోసా ఇవ్వడం లేదు. నిత్యావసర వస్తువులు ధరలు భారీగాపెరుగుతున్నాయి. విద్యుత్ ఛార్జీల భారం మూడేళ్లుగా వెంటాడుతోంది. వీటిని భవిష్యత్తులో తగ్గిస్తామని కానీ, భారం కొద్ది రోజుల తరువాత ఉండదనికూడా భరోసా ఇవ్వడం లేదు. అలాగే ఇప్పటికీ సంక్షేమ పథకాలు అందని వారి గురించి పట్టించుకోవడంలేదు. గత ఏడాదికాలం రేషన్ కార్డుకు దరఖాస్తు చేస్తే ఆరునెలలకు ఇస్తున్నారు. తరువాత కార్డు వచ్చిన తరువాత పింఛన్లకు దరఖాస్తు చేస్తే మళ్లీ ఆరునెలలు ఆగాల్సి వస్తుందని అయినా ఈ అంశాలను ప్రజా ప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని పలువురు పేదలు వాపోతున్నారు. సామాజిక యాత్ర అని చెబుతున్నా జిల్లాలో ఎస్‌సి,ఎస్‌టి, బిసి,మైనార్టీలపై దాడులు జరగకుండా కూడా చూస్తామని,వీరి ఆస్తులకు రక్షణ కల్పిస్తామన్న భరోసా కల్పించలేకపోతున్నారు.

(ఎ.వి.డి.శర్మ)

యుటిఎఫ్ నూతన మండల కమిటీలు ఎన్నిక

ప్రజాశక్తి - మేడికొండూరు

యుటిఎఫ్ మండల కమిటీ సమావేవం స్థానిక ఎంపిపి ఎస్ హెచ్ఇ పాఠశాలలో ఎస్.సూర్యప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి కళాధర్, కార్యదర్శి గోవిందయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా బి.శ్రీనివాసరావు, అధ్యక్షులుగా యుసిహెచ్ గోపయ్య, సహాధ్యక్షులుగా ఎన్.ఆంజనేయులు, మహిళా అధ్యక్షురాలుగా ఎన్.అరుణ, ప్రధాన కార్యదర్శిగా వి.వినోద్‌బాబు, కోశాధికారిగా ఎస్.పాండురంగారావు, ఆడిట్ కమిటి కన్వీనర్‌గా టి.బాలసుబ్రహ్మణ్యం, మండల సిపిఎస్ కన్వీనర్‌గా వి.రామయ్య, జిల్లా కౌన్సిలర్‌గా వివి.శ్రీనివాసరావు, యు.గంగయ్య, పి.మరియన్న, డి.వెంకటరమణ, పి.జోజప్ప, వై.వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా హనీఫ్, ఎం.జ్యోతి, అనంతలక్ష్మి, ఎం.రవి, అబ్దుల్ కరీం ఎన్నికయ్యారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

యుటిఎఫ్ మండల కమిటీ సమావేశం పాలపర్రులోని నారసింహం హైస్కూల్లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఎన్.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.పాణిరెడ్డి, కోశాధికారిగా వి.చంద్రశేఖర్‌రావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా నాయకులు ఎం.గురుబ్రహ్మం వ్యవహరించారు.

గుంతలు పూడ్చలేని అసమర్థ ప్రభుత్వం

ప్రజాశక్తి - గుంటూరు, పల్నాడు జిల్లాల విలేకర్లు

రహదారులు అధ్వానంగా ఉండడంపై గుంటూరు, పల్నాడు జిల్లాల్లో టిడిపి, జనసేన శ్రేణులు శనివారం నిరసన చేపట్టాయి. గుంతల ఆంధ్రప్రదేశ్ కు దారేది' పేరుతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఆర్‌టిసి బస్టాండ్ వెనుక కొల్లిశారద మార్కెట్ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు నశీర్ అహ్మద్, జనసేన నాయకులు నేరెళ్ల సురేష్ మాట్లాడారు. టిడిపి నాయకులు కోవెలమూడి రవీంద్ర, జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఎటి అగ్రహారంలో రహదారులో నిరసన తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలంలోని గాంధీనగర్ ఏనుగుపాలెం రోడ్డులో నిరసన కార్యక్రమం చేపట్టగా టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు, టిడిపి, జనసేన సమన్వయ కమిటీ కన్వీనర్ నాగశ్రీను రాయల్ మాట్లాడారు. ఏనుగుపాలెం రోడ్డుతో పాటు నియోజకవర్గంలోని అనేక ఆర్ అండ్ బి, రాష్ట్ర హైవే రోడ్లు గోతులమయమై ప్రయాణం నరకయాతనగా మారిందన్నారు. ఈ రోడ్డులో కొద్దికాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 11 మంది ప్రాణాలు కోల్పోగా వందలాదిమంది అమాయక ప్రజలు చేతులు కాళ్లు విరిగి అంగవైకల్యానికి గురైన సంఘటనలు ఉన్నాయని చెప్పారు. మంగళగిరి పట్టణం తెనాలి ఫ్లై ఓవర్ దాటిన వెంటనే ఉన్న మంగళగిరి కృష్ణ వాటర్ పంపింగ్ హౌస్ ఎదుట జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మంగళగిరి నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త నందం అబద్దయ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అచ్చంపేట మెయిన్ రోడ్డు రాగి చెట్టు మీదగా ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నిరసన తెలిపారు. తెనాలి- విజయవాడ ప్రధానరోడ్డుపై ఇరు పార్టీల శ్రేణులు బైఠాయించాయి. దీంతో రోడ్డుకు ఇరువైపులా కాసేపు ట్రాఫిక్ స్తంభించింది. సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ రహదారిలో నిరసన చేపట్టగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడారు. నరసరావుపేట మండలం జొన్నలగడ్డ, ఇస్సపాలెం వద్ద రోడ్డుపై ఇరుపార్టీ శ్రేణుల నిరసన తెలిపారు.

వినుకొండ నియోజకవర్గంలో నిరసన

విస్తరణ పనులు పరిశీలిస్తున్న మేయర్

రహదారుల అధ్వాన పాపం మీదే

టిడిపి,జనసేనపై మేయర్ మనోహర్ నాయుడు ధ్వజం

రూ.13.70 కోట్లతో ఎటిఅగ్రహారంరోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

గుంటూరులో రహదారులు అధ్వానంగా ఉండటానికి టిడిపి, జనసేన పార్టీలే కారణమని మేయర్‌కావటి మనోహర్ నాయుడు ఆరోపించారు. గుంటూరులోని ఏటి అగ్రహారం విస్తరణ పనులను అధికారులతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న ఈ పార్టీలు గుంటూరులో భూగర్భ డ్రెయినేజి పథకం పేరుతో రహదారులన్నీ తవ్వేసి చిన్నాభిన్నం చేశాయని అన్నారు. ఇప్పుడు రహదారులు మెరుగుపరుస్తుంటే ఓర్వలేక నిర్మాణంలో ఉన్న రహదారులపై నిరసన పేరులో డ్రామాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. నగరంలో ఏ.టి అగ్రహారం రోడ్డు ఎంతో ప్రధానమైనదని, పల్నాడు, ఒంగోలు ప్రాంతాల నుండి గుంటూరు నగరంలోకి ప్రవేశించుటకు ఎంతో అనువుగా ఉంటుందని, అందుకే రూ.13 కోట్లతో 80 అడుగుల విస్తరణ చేపట్టి, రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని అన్నారు. రోడ్డు విస్తరణలో మొత్తం 182 గృహాలుండగా వాటిలో సుమారు 170 గృహాల వారు స్థలం ఇవ్వటానికి అంగీకరించారని, మిగిలిన గృహాల్లో కొందరు కోర్టుకు వెళ్లటం వల్ల రోడ్డు నిర్మాణ పనులు ఆగాయని చెప్పారు. వారిని కూడా ఒప్పించి, రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డును విస్తరించి, సెంటర్ డివైడర్ ఏర్పాటు చేసి, స్ట్రీట్ లైటింగ్, డ్రెయిన్లను నిర్మించి ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు ఎ.సంతోష్, పి.సుబ్బారెడ్డి, ఎ.వెంకటరెడ్డి, ఎ.పద్మావతి, జిఎంసి ఎస్ఇ భాస్కర్‌రావు, ఇఇ సుందర రామిరెడ్డి పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా అమరావతిలోని శ్రీ బాల చాముండికాదేవి సమేత అమరేశ్వర స్వామి వారి దేవస్థానంలో అమరేశ్వర స్వామి వారికి లక్ష బిల్వార్చన పూజ నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి వేమూరి గోపి పాల్గొన్నారు. కార్తీక మాసం కావడంతో సందర్శకులు ఎక్కువగా వచ్చారు.

ద్విచక్ర వాహనాలు ఢీ- ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-తెనాలి

ఎదురుదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన జి హేమంత్, తేజ ఇరువురు మెడికల్ రిప్రజెంటేటివ్స్ గా పని చేస్తున్నారు. తెనాలిలో పనులు ముగించుకుని తిరిగి బైక్ పై గుంటూరుకు బయలుదేరారు. కఠెవరం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ప్రమాదంలో గాయ పడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాల్వలో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

మండల లోని వరగాని గ్రామ పంచాయితీ పరిధిలో గల సిరి కోల్డ్ స్టోరేజీ దగ్గరలో పెదనందిపాడు నుండి గుంటూరు వెళ్లే రహదారి పక్కన కాల్వలో గుర్తుతెలియని మృతదేహాన్ని శనివారం గుర్తించారు. మృతుడి వయసు సుమారు 50 ఏళ్లకు పైబడి ఉంటుంది. గడ్డం పెరిగి ఉన్న అతను,రెండు చొక్కాలు ధరించి ఉన్నాడు. సుమారు మూడు నాలుగు రోజుల క్రితం కాలవలో పడినట్లుగా భావిస్తున్నారు. వరగాని విఆర్ఒ ఫిర్యాదు మేరకు సం ఘటనా స్థలానికి పెదనందిపాడు ఎస్ఐ షేక్ అబ్దుల్ రహమాన్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని సమాచారము ఎవరికైనా తెలిస్తే పెదనందిపాడు స్టేషన్ హౌస్ ఆఫీసర్ 9440900 872, ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ 8688831383 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

ఇప్పటం రేషన్ షాపులో తనిఖీ

6ఎ కింద కేసు నమోదు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటీఎంసీ పరిధిలోని ఇప్పటంలో సివిల్ సప్లయ్ డియస్ఓ కు అందిన ఫిర్యాదు మేరకు రేషన్ షాపును శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డియస్పీ కోమలి పద్మ మాట్లాడుతూ గత కొంత కాలంగా ఇప్ప టంలో 21వ రేషన్ షాపు నిర్వహిస్తున్న శివరమణ కుమారి లబ్దిదారులకు బియ్యం పంపిణీ చేయకుండా, వేలిముద్రలు వేయించుకుని, డబ్బులు ఇస్తామంటూ చెబుతోందని, జరిగిన ఈ సంఘటనపై కొందరు ఫిర్యాదు చేయడంతో, 21వ నెంబరు షాపును తనిఖీ చేశామని, ఈ షాపులో లబ్దిదారులకు ఇవ్వకుండా మిగిల్చిన బియ్యం 900 కేజీలు గుర్తించామని, పంచదార అరకిలో ప్యాకెట్లు 150 గుర్తించి నిత్యావస సరుకుల చట్ట ప్రకారం 6ఎ కింద కేసు నమోదు చేశామని ఆమె తెలిపారు. ఈ తనిఖీల్లో మంగళగిరి సియస్డిడి దుర్గారావు, విఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తనిఖీ ప్రాంతంలో వేలిముద్రలు వేసుకుని బియ్యం ఇవ్వని వారిని కలిసి వివరాలు సేకరించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భగా అసోసియేషన్ అధ్య క్షులు తిరుమల శెట్టి ఉమాశంకర్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెల గ్రూప్ సభ్యుల సహకారంతో అన్న దానం చేస్తున్నట్లు చెప్పారు. శీతాకాలం సందర్భంగా పొన్నూరు పట్టణంలో పలు ప్రదేశంలోని ఎందరో నిరాశ్రయులకు, వృద్ధాశ్రమల్లోని వృద్ధులక,యాచకులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి గుడివాడ పవన్, తిరుమలశెట్టి సూర్య, జాహ్నవి మేఘనాథ్, నరేంద్ర ఫార్మసి పెరవలి నరేంద్ర, కేవీఆర్ ట్రస్ట్ కాట్రగడ్డ విజయకుమార్, వీరనాల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఎవరైనా తమ సంస్థ చేసే కార్యక్రమాల్లో పాల్గొని తమ వంతు సహకారాలు అందించగలరని కోరారు.

పొన్నూరు నుండి శైవక్షేత్రాలకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రముఖ శైవ క్షేత్రములైన యాగంటి, మహానంది, శ్రీశైలంలకు పొన్నూరు ఆర్టీసీ డిపో నుండి ప్రత్యేక బస్సులను నడుపు తున్నట్లు పొన్నూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అజిత కుమారి శనివారం విలేకరులకు తెలిపారు. “పంచారామలు”కార్తీక పౌర్ణమినాడు “గిరి ప్రదక్షిణ” కు కూడా ఆర్టీసీ బస్సులను తిప్పుట జరుగు తుందని తెలిపారు. అదీ కాక “ప్రత్యేక ప్యాకేజీ” క్రింద ప్రత్యేక ఆర్టీసీ బస్సులను కూడా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కావలసిన యాత్రికులు, భక్తులు ట్రాఫిక్ ఇంచార్జిని, కాని డిపో మేనేజర్ ని కాని సంప్రదించి బస్సులను సకాలంలో బుకింగ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మాసము నుండి వట్టి చెరుకూరు, తెనాలి, నిజాంపట్నం బస్సులలో తిరుగు ప్రయాణికుల కొరకు ప్రత్యేకంగా “గిఫ్ట్ స్కీము” ను ప్రవేశపెట్టినట్లు చెప్పారు.తెలిపారు. కావున ప్రయాణికులు ఈ సదావకాశంను సద్వినియోగ పరచుకొని ఆర్టీసీ అభివద్ధికి తోడ్పడాలని ఆర్టీసీ డిఎం రజిత కుమారి పేర్కొన్నారు. పూర్తి వివరాలను స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ (0863-244441) సెల్ నెంబర్కు కాల్ చేసి తెలుసుకోవాలని ఆమె కోరారు.

వేమవరంలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-మాచవరం

మండలంలోని వేమవరంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గ్రామంలో ఇంటింటికి తిరిగి మ్యానిఫెస్టో గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

ముగిసిన పాన్ ఇండియా వర్క్‌షాప్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

శాస్త్ర సాంకేతిక రంగాల అభివద్ధికి మోది ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర కేంద్ర నైపుణ్యాభివద్ధి, వ్యవస్థాపకత ఎలక్ట్రానిక్స్ ఐటి శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. శుక్ర, శనివారాల లో కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో జరిగిన పాన్ ఇండియా వర్క్ షాపులో ఆన్ లైన్ ధ్వారా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన వివిధ విశ్వవిద్యాలయాలను ఉద్దేశించి ప్రసంగించారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు: ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ గుంటూరు శాఖ, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెని టేనియల్ సం యుక్త ఆధ్వర్యంలో స్థానిక కొరిట పాడులోని విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ ఆవరణలో పేదలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. డాక్టర్ కోట ప్రగతి, డాక్టర్ గాజుల రామయిశొష్ణ,

డాక్టర్ యలవర్తి కిరణ్, డాక్టర్ మహమ్మద్ ఇమ్రాన్ తదితరులు వైద్య సేవలు అందించారు. బ్యాంక్ మేనేజర్ కె.బుల్లికుమార్ మాట్లాడుతూ సహకార బ్యాంకింగ్ రం గంలో సరికొత్త చరిత్ర సృష్టిస్తోందని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ పివి రమణరావు, జోనల్ మేనేజర్ సిహెచ్వి.సుబ్రహ్మణ్యం, సంగటిగుంట బ్రాంచ్ మేనేజర్ కనకారావు, పి.శిరీష పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుముఖి పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో గ్రంథాలయ జాతీయ వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించినట్లు కెఎల్ యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ కె. తాతారావు ఒక ప్రకటనలో తెలిపారు. వర్శిటీ విద్యార్దులతో పాటు జిల్లాలోని తెనాలితో పాటు పలు గ్రామాలకు పాఠశాల విద్యార్దులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని ఆయన తెలిపారు. ఆధునిక టెక్నాలజీ పుణ్యమా అని బాల బాలికలలో పుస్తకాలను చదవే అలవాటు తగ్గిపోతుందని ఆంధోళన వ్యక్తం చేశారు. పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల వరకు పుస్తకాలను చదివే అలవాటును మరింతగా పెంచుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.శారద ముఖ్య అతిథిగా హాజరయి విద్యార్దులనుద్దేశించి ప్రసంగించారు. ప్రతీ రోజు ఓదో ఒక పుస్తకాన్ని చదవడాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని హితవు పలికారు. అనంతరం వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, పిఅండ్ డి డీన్ డాక్టర్ వి.రాజేష్ మాట్లాడుతూ కెఎల్ యూనివర్శిటీలో ఉన్న సెంట్రల్ లైబ్రరీకి అత్యాధునిక టెక్నాలజీని అనుసంధానం చేసి పూర్తిగా కంప్యూటరైజ్డ్ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా తమ వర్శిటీలోని సెంట్రల్ లైబ్రరీలో పాఠకులు పుస్తకాలను పొందడానికి తిరిగి అప్పగించడానికి ఆన్ లైన్ తో పాటు విధానంతో పాటు పాఠకులను లోపలికి అనుమతించ డానికి కూడా పూర్తిగా ఆటోమేటిక్ మిషన్ విధానాన్ని అనుసంధానం చేశామన్నారు. అనంతరం అత్యధిక పుస్తకాలను తమ యూనివర్శిటీ గ్రంధాలయంలో చదివిన విద్యార్థినీ, విద్యార్దులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, పి అండ్ డి అసోసియేట్ డీన్‌లు డాక్టర్ జిఆర్కే. ప్రసాద్, డాక్టర్ బ్రహ్మాచారి, డాక్టర్ ఇంతియాజ్, ఇంచార్జి ప్రొఫెసర్ డాక్టర్ బి.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-రాజుపాలెం

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం రాజుపాలెం శాఖ గ్రంథాలయంలో విద్యా ర్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వ హిం చారు. వివిధ పాఠశాలలు నుండి 96 మంది విద్యా ర్థులు పోటీలలో పాల్గొన్నారని గ్రం థాలయ అధికారి కె.ఎస్. ఎస్.ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఉపా ధ్యాయులు బి.నరసింహారావు,ఎన్. బాబు, కె.కిరణ్ కుమార్, సుమన్,మాణిక్యరావు, వెంకటేష్,రోశయ్య, పాల్గొన్నారు

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ పోటీలు పోటీలు విద్యార్థినీవిద్యార్థులకు నిర్వ హించారు. గ్రంథాలయ వారోత్సవాలు భాగంగా ఏర్పాటు చేశారు. ఈ పోటీలలో సెయింట్ ఆన్స్ హై స్కూల్ ,కాకతీయ హై స్కూల్, పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ, గ్రంథాలయ అధికారి వాణి పాల్గొన్నారు.

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు...

OS No: 237/2023.

అన్నాప్రగడ నాగ ప్రవీణ్ కుమార్.. వాది.
మరియు
బొంతు మనోజ్ రెడ్డి... ... ప్రతివాది.

To,
బొంతు మనోజ్ రెడ్డి S/o ప్రకాష్ రెడ్డి,
సాయికృష్ణ టవర్స్, ప్లాట్ నెం.102, 60అడుగుల రోడ్డు, ప్రకాష్ నగర్, నరసరావుపేట.

సదరు దావాలో వాది మీ వద్ద నుండి రికవరీ అమౌంట్ కింద దావా దాఖలు చేసి సదరు దావాలో మీకు అనేక పర్యాయములు కోర్టు ద్వారా నోటీసులు పంపించిననూ నోటీసులు తీసుకోనందున చివరిసారిగా పేపర్ ప్రకటన ద్వారా నోటీసులు పంపించమని శ్రీ కోర్టు వారు ఆర్డర్ వేసినారు. కావున మీరు ది.6-12-2023 న ఉదయం 10:30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్ష మందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

వాయిదా ది. 6-12-2023.

శ్రీగిరిరాజు అయ్యప్పరాజు,
వాది తరపు న్యాయవాది,
ప్రకాష్ నగర్, నరసరావుపేట,
పల్నాడు జిల్లా.

మహారాజ శ్రీ సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

A.S NO. 10/2017

బిట్వీన్
చిలకా కోటేశ్వరరావు ..... అప్పిలెంట్
VS
1.చిలకా హనుమంతరావు (లేట్)
2.చిలకా అంకమ్మరావు మరియు వగైరాలు
.... రెస్పాండెంట్స్

To,
R-6 : చిలకా త్రివేణి తండ్రి హనుమంతరావు (లేట్)
R/o నూతక్కి గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

పై నెంబరు అప్పీల్‌లో నీ యొక్క హాజరు నిమిత్తము శ్రీ కోర్టు వారు ఎదుట ది 22-12-2023 వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున సదరు వాయిదా తేదీన పై తెలిపిన కోర్టులో ఉదయం 10-30 ని:లకు స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరయి నీ యొక్క ఆక్షేపణలు తెలుపు కోవలయును. లేనిచో నీ పై పరోక్షముగా తీర్మానించబడుననీ ఇందుమూలముగా తెలియజేయడమైయినది.

కోర్టు వారి ఉత్తర్వులమేరకు
వాయిదా తేదీ. 22.12.2023

బి.ఎల్.చిన్నయ్య
అప్పీలెంట్ తరుపు న్యాయవాది
సత్తెనపల్లి
సెల్ :9848771757

మాట్లాడుతున్న అసిస్టెంట్ లేబర్ అధికారి కిలారు విష్ణు

బాల్య వివాహాలు, బాల కార్మికుల నియంత్రణ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బాలల వారోత్సవాలలో భాగంగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సిబ్బంది నరసరావుపేటలోని కస్తూర్బా గాంధీ బాలికాల విద్యాలయంలో శనివారం బాల కార్మికుల నియంత్రణ చట్టం, బాల్యవివాహల నిషేధ చట్టంపై అవ

గాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కిలారు విష్ణు మాట్లాడుతూ ప్రతి విషయంపై బాలలు ఆలోచన తత్వాన్ని కలిగి ఉండాలన్నారు. సమాజంలో ఆలోచన స్థితి లేని వారే ఎక్కువగా మోస పోతున్నారని, విద్య ద్వారా ఆలోచించే తత్వం సాధ్యమవుతుందని చెప్పారు. బాలికలు 21 ఏళ్ళు నిండే వరకు విద్యను అభ్యసించాలని అప్పటివరకు చదువుకు ఆటంకం కలిగించే పనులకు, వివా హానికి దూరంగా ఉండాలని సూచించారు. బాలల హక్కులును కాపాడేందుకు ఉపా ధ్యాయులు, తల్లి దండ్రులు సమాజం సహాయపడాలన్నారు. ప్రాథమిక బాలల హక్కులు, చట్టాలపై డిబిఆర్సి సిటీ కోఆర్డినేటర్ వేణు అవ గాహన కల్పించారు. ఉపా ధ్యాయులు అరుణ, బాపమ్మ, సులోచన, ఆదిలక్ష్మి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు.

ప్రతిభ చాటిన క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు 'కెబిఆర్' విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈ నెల 17న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అంతర కళాశాలల కుస్తీ పోటీలలో నరసరావుపేటలోని కాసు బ్రహ్మానందరెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థులు వై.సాంసన్, డి.ధల్మా నాయక్ లు 60 కేజీలు ,65 కేజీల గ్రీకో రోమన్ స్టైల్ విభాగంలో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి హెచ్ నాగిరెడ్డి శనివారం తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి పల్నాడు జిల్లాకు, కళాశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షిచారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రత్యేకంగా అభినందించారు. కుస్తీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. తమ కళాశాలలో విద్యతో పాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఏ. వెంకట శివ, ఫిజికల్ డైరెక్టర్ ఎం.వినీల్ అభినందనలు తెలిపారు.

కార్మికులు, స్కీమ్ వర్కర్ల సమస్యలను

పట్టించుకోని ప్రభుత్వాలు

- పెరిగిన ధరలకు అనుగుణంగా పెరగని వేతనాలు
- 27,28 తేదీల్లో నిరసన దీక్షలు జయప్రదం చేయండి
- సిఐటియు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు

సమావేశంలో పాల్గొన్న కె.ఎం శ్రీనివాసరావు,గుంటూరు మల్లేశ్వరి, కెపి మెటిల్డా దేవి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా పెరగని వేతనాలతో కార్మికులు, అసంఘటితరంగ కార్మికులు, అంగన్వాడీలు, స్కీం వర్కర్లు అర్థాకలితో అల మటిస్తున్నారని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఎం శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో శనివారం నరసరావుపేట ప్రాజెక్టు సమావేశం జరిగింది. సమావేశానికి ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షురాలు కెపి మెటిల్డా దేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుమాట్లాడుతూ పనిచేసే క్రమంలో కార్మికులు అని, వేతనాలు ఇవ్వాలంటే వాలంటీర్లు.. సేవాపరులు అని అంటున్నారని విమర్శించారు. ఆశా, అంగన్వాడి, స్కీమ్ వర్కర్లకు పిఎఫ్, ఈఎస్ఐ, కనీస వేతనాలు సైతం అమలు చేయడం లేదని విమర్శించారు. బిజెపి అను సరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 27,28 తేదీలలో విజయవాడలో జరగనున్న నిరసన దీక్షలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అఖిల భారత కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశంలో ఉన్న కార్మిక, వ్యవసాయ, రైతు, కార్మిక సంఘాలు , సంయుక్త కిసాన్ మోర్చా 500 సంఘాలు పైబడి బిజెపి విధానాలను ప్రజలకు దేశానికి కలిగిస్తున్న నష్టాలను వ్యతిరేకిస్తూ నిరసన చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో వేతనాలు, ఇతర సమస్యల గురించి ప్రశ్నించలేని పరిస్థితి దాపురించిందని ఎద్దేవా చేశారు. అంగన్వాడీలకు కనీస వేత నాలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ గ్రాట్యూటి వర్తింప జేయాలని, ఉన్నత న్యాయస్థానాలు తీర్పు చెప్పినా ఫలితం శూన్యమని అన్నారు. కర్ణాటకతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో గ్రాట్యూటీ అమలు చేస్తు న్నారని, ఆశా, అంగన్వాడి స్కీమ్ వర్కర్లకు తక్షణమే కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కంటే వెయ్యి రూపా యలు అదనంగా ఇస్తామని చెప్పి కనీసం సమానంగా కూడా ఇవ్వడం లేదని విమ ర్శించారు. ఐక్య పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలనే ఉద్దేశంతోనే దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్ర కేంద్రాల్లో నిరసనలు జరుగుతాయన్నారు. వైజాగ్ విశాఖ ఉక్కు పరిశ్రమకు ప్రభుత్వం రూ 5 వేల కోట్లు పెటుబడులు పెడితే ఇప్పటి వరకు రూ.50 వేల కోట్లకుపైగా పన్నుల రూపంలో ప్రభుత్వానికి చెల్లించడం జరి గిందని, ప్రస్తుతం విశాఖ ఉక్కు పరిశ్రమ విలువ రూ.3 లక్షల కోట్లు కాగా అతి తక్కువ మొత్తానికి అదాని, అంబానీలకు కారుచౌకగా కటబెట్టాలని చూస్తోందని విమర్శించారు. విద్యుత్,పోస్టల్, రైల్వే ఎల్ఐసి ఇలా అన్ని ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేసి రాష్ట్రానికి, ప్రజలకు తీరని ద్రోహం చేస్తోందని కేంద్ర ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు. ప్రభుత్వ యం త్రాంగం మొత్తం ప్రైవేటీకరణ జరిగితే రానున్న రోజుల్లో ప్రజలపై భారాలు మరింత పెరుగుతాయన్నారు.

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి మాట్లాడుతూ వివిధ స్కీములకు ఇచ్చే నిధులను తగ్గించారని, ప్రజలకు ఇచ్చే పౌష్టికాహారంలో కోతలు పెడుతున్నారని, తొమ్మిదిన్నరేళ్ల బిజెపి పాలనలో ఆశా, అంగన్వాడీలకు వేతనాలు పెంచిన దాఖలాలు లేవని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ కనీసం యూనియన్ నాయకులను చర్చలు కూడా పిలవలేదని అన్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 21, 22 తేదీల్లో అన్ని ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నాలు చేయనున్నట్లు చెప్పారు. అయినప్పటికీ ప్రభుత్వ స్పందించకపోతే వచ్చే నెల 8 నుండి సమ్మెకు వెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు. ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా అర్హులకు హెల్పర్లుగా, టీచర్లుగా పదోన్నతి కల్పించాలని, అంగన్వాడి సెంటర్లలో మౌలిక సదు పాయాలు కల్పించాలని, 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. యూని యన్ జిల్లా అధ్యక్షురాలు కెపి మెటిల్డా దేవి మాట్లాడుతూ నవంబర్ లో అన్ని యాప్ లను కలిపి ఒకే యాప్ చేసి ఇబ్బంది లేకుండా చేస్తామని చెప్పిన డైరెక్టర్ ఆ దిశగా చర్యలు తీసుకోలేదని అన్నారు. మూడు నెలలుగా వేతనాలు లేక టిఎలు, సెంటర్ అద్దెలు, గ్యాస్ సొంత నిధులతో సెంటర్లు నడుపుతున్నట్లు చెప్పారు. చివరకు రిజిస్టర్లు కూడా అంగ న్వాడీల సొంత నిధులతో కొనుగోలు చేయాల్సి వస్తోందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నిర్మల, కవిత, మాధవి, సాయి, నాగమణి, వెంకటరమణ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు అనుముల వీరబ్రహ్మం

పెన్షనర్ల ధర్నాకు సిపిఎం సంఘీభావం

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

తమ భవనంలో లీజు కాలం పూర్తయినా దౌర్జన్యంగా వ్యాపారం చేస్తున్న పయనీర్ ఆటో మొబైల్ యాజమాన్యం తక్షణమే ఖాళీ చేయాలని డిమాండ్ చేస్తూ గత నాలుగు రోజులుగా ఆ షాపు ముందే ధర్నా చేస్తున్న ఎపి ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘాన్ని శనివారం సిపిఎం పట్టణ, మండల నాయకులు సందర్శించారు. వారికి పూర్తి సంఘీభావం తెలుపుతూ ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వం శాఖల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం సహకారంతో సంఘ భవనాన్ని నిర్మించుకున్నారని, దానిని పయనీర్ ఆటో మొబైల్ సంస్థ యజమాన్యం నామ మాత్రపు అద్దెకు లీజుకు తీసుకుందని, లీజు కాలం పూర్తయిన ఖాళీ చేయడం లేదని అన్నారు. పయనీర్ ఆటో మొబైల్ సంస్థ మొండి వైఖరిని ప్రతి ఒక్కరూ ఖండించాలని, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం న్యాయపరమైన డిమాండ్కు అండగా నిలవాలన్నారు. ప్రభుత్వం,పోలీసులు కూడా ఇప్పటికైనా ప్రేక్షక పాత్ర వీడి యాజమాన్యంపై తగు చేర్యలు తీసుకోవాలని, ఖాళీ చేయించి రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. అసోసియేషన్‌కు తాము అన్ని విధాలుగా సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.మహేష్, ఎ.వీరబ్రహ్మం, జె.రాజ్ కుమార్, ఎం.జగన్నాథం, పి.ప్రభాకర్, పి.సూర్య ప్రకాశరావు, ఆర్.పురుషోత్తం, అసోసియేషన్ నాయకులు పి రామకోటయ్య, అంకాళ్ళ ప్రభుదాస్, నరసింహారావు, హనుమంతరావు, లియోరాజ్, సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

సిడిపిఒకు అంగన్వాడీల వినతిపత్రం

ప్రజాశకి-నాదెండ్ల : అంగన్వాడీలకు వేతనాల పెంపు, గ్రాడ్యూటి అమలు, ఇతర సమస్యల పరిష్కరించాలని అంగన్వాడీలు కోరారు. ఈ మేరకు నాదెండ్ల సిడిపిఒకు శనివారం వినతిపత్రం అందజేశారు. సమ్మె నోటీస్‌ను అందజేశారు. రాష్ట్రంలో ఉన్న మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, అంతవరకూ టీచర్లకు ఇచ్చే వేతనాలు ఇవ్వాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, సర్వీసులో ఉండి చనిపోతే వర్కర్ అండ్ హెల్పర్ వారి కుటుంబంలో మరొకరికి ఉద్యోగం, బీమా కల్పించాన్నారు. కార్యక్రమంలో పేరు బోయిన వెంకటేశ్వర్లు, ప్రభావతి పాల్గొన్నారు

భారీ పాము కలకలం

ప్రజాశక్తి-కారంపూడి

స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూలు పక్కనగల పాత మిల్లులో కొండచిలువను పోలిన భారీ పాము స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. ఆ మిల్లులో పనిచేసే కొందరు యువకులు పామును కొట్టి చంపారు. మిల్లులో పనిచేసే వర్కర్లు ఊపిరి పీల్చుకున్నారు .

అంతర్ జిల్లాల సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు

ఒప్పిచర్ల విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి -కారంపూడి

ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల అక్టోబర్‌లో నరసరావుపేటలోని శంకర భారతిపురంలో సబ్ జూనియర్ ఖోఖో బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికలు జరిగాయి. ఇందులో భాగంగా ఒప్పిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన 8వ తరగతి విద్యార్థిణి నాగ శ్రీలక్ష్మి, 7వ తరగతి విద్యార్థిణి శివమణిలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు విజయ లలితా తెలిపారు. ఈ నెల 26 తేదీ నుండి 28వ తేదీ వరకు పల్నాడు జిల్లా నరస౯రావుపేటలో జరిగే అంతర జిల్లాల ఖోఖో పోటీల్లో వారు పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు చిన్న రత్తయ్య తెలిపారు. శనివారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో విద్యార్థిణులను ఉపాధ్యాయులు ఆశా, దుర్గాదేవి, నిర్మలా, అంజిరెడ్డి, అబ్దుల్ రఫి, రమాదేవి, హనుమంతరావు, బలరాం, కిరణ్‌కుమారి, సీతమాలక్ష్మి, సౌజన్య, సంధ్యా అభినందించారు.

27, 28 తేదీల్లో మహాధర్నాను విజయవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో నిర్వహించే మహాధర్నాలో రైతులు, కార్మికులు, ఉద్యోగ సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రైతుసంఘ రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం పెదనందిపాడులోని తేళ్ల నారాయణ ,విజ్ఞాన కేంద్రంలో డి.రమేష్‌బాబు అధ్యక్షతన అఖిలపక్ష రైతు సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు నెలలుగా సరైన వర్షాల్లేవని, 28 లక్షల ఎకరాల్లో పంటలు సాగవలేదని చెప్పారు. 360 మండలాల్లో కరువు నెలకొందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 400 ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని, 3 వేల టిఎంసీల నీరు సముద్రం పాలైందని అన్నారు. రైతులకు విత్తనం నుండి పంట అమ్ముకునే దాకా ఆర్బికేలు చేయూతగా ఉంటాయన్న ప్రభుత్వ మాటలు డొల్లేనని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ పరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని, 60 లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులకు నష్టం కలిగేలా వ్యవహరిస్తున్నాయని చెప్పారు. అమూల్ డెయిరీ వల్ల స్థానిక పాడి రైతులు దెబ్బతింటున్నారని అన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ మాట్లాడుతూ గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగింపు పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నీటి సమస్యల వల్ల పంటలు కోల్పోయిన మండలాలను గుర్తించి కరువు మండలాలుగా ప్రకటించి రైతులు, కౌలు రైతులకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎన్.ఆచార్యులు, కె.హరిబాబు. ఆర్.వినోద్, బి.శంకరయ్య, కె.వెంకట సుబ్బారావు, సిహెచ్.యానాదులు, ఎం.రమణ, ఎం.టైటాస్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

రైతు సంఘం తాడేపల్లి మండల కమిటీ సమావేశం డోకిపర్తి రాజు అధ్యక్షతన తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని ప్రధాని మోడీ గతంలో ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వ హయాంలో దేశంలో నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, కల్తీ మందుల వల్ల ప్రతి ఏటా రైతాంగం రెండు లక్షల కోట్ల రూపాయలు నష్టపోతున్నారని చెప్పారు. కౌలు రైతులతో సహా రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని కోరారు. అమరావతినే రాజధానిగా కొనసాగించడంతో పాటు రైతుల అప్పులను రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక హక్కులను పునరుద్ధరించాలని చెప్పారు. భూ సర్వేలో జరుగుతున్న పొరపాట్లను సరి చేయాలన్నారు. రైతు సంఘం మండల అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కాల్వలో చేరుతున్న మురుగు నీటిని అరికట్టాలని, డొంక రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, చిర్రావూరు పశువుల ఆసుపత్రిలో వైద్యున్ని నియమించాలని, తాడేపల్లి బకింగ్ హామ్ కాలువపై డబుల్ లైన్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు డి.వెంకటరెడ్డి, బి.గోపిరెడ్డి, డి.బుల్లికోటిరెడ్డి, శివారెడ్డి, కౌలు రైతు సంఘం నాయకులు పి.కృష్ణ, సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరిశోధనా రంగంలో ఆవిష్కరణలు అవసరం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : పరిశోధనా రంగంలో నూతన ఆవిష్కరణలు దేశ పురోగతికి దోహదపడతాయని, ఆదిశగా యువ శాస్త్రవేత్తలు, పరిశోధన రంగ విద్యార్థులు అడుగులు వేయాలని ఐఐఎస్‌ఃతీ (బెంగుళూరు) సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ శివఉమాపతి సూచించారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శనివారం ఏడో రీసెర్చ్ డే వేడుకలను వీసీ ప్రొఫెసర్ మనోజ్‌కుమార్ అరోరా ప్రారంభించి మాట్లాడారు. శాస్త్రీయ పరిశోధనలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదులుగా మారుతాయని అన్నారు. పరిశోధనలు విస్తృతం చేందుకు వర్సిటీ చేస్తున్న కృషిని వివరించారు. వర్సిటీ పరిశోధన ప్రగతి వేదికలను యూని వర్సిటీ రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజితాబా ప్రకటించారు. అనంతరం పరిశోధనలకు సంబంధించిన ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించారు. పేపర్ ప్రజెంటేషన్ పోటీల్లో విజేతలైన పరిశోధన రంగ విద్యార్థులకు బంగారు, రజత పతకాలు ప్రదానం చేశారు. ఎస్ఆర్ఎం యూనివర్సి టీతోపాటు, వివిధ యూనివర్సిటీల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 33 మందికి బంగారు పతకాలు, 26 మందికి రజత పతకాలు లభించాయి. రిజిస్ట్రార్ ఆర్.ప్రేమ్‌కుమార్, డీన్ డాక్టర్ విష్ణుపద్దు, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ రాజపాండ్యన్, డాక్టర్‌సునిల్ చినదొరై, డాక్టర్ మంజుల, ప్రొఫెసర్ జయ శీలన్ పాల్గొన్నారు.

నూర్‌బాషాలకు గుర్తింపు ఇవ్వండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో నూరు బాషాలకు ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కమిటీ వైస్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి కోరారు. ఈ మేరకు శనివారం మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్‌తో కలిసి ఆయన కలెక్టర్ వేణుగోపాలరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. బిసి కులాల నమోదులో తమ కులానికి తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. చాలా కాలంగా నూరు బాషా ముస్లిమ్ దూదేకులు తగిన గుర్తింపునకు నోచక రాజకీయంగా, సాంఘికంగా వెనుకబడ్డారన్నారు. రాష్ట్రంలో తమ కులస్తులు 20 లక్షల మంది ఉండగా నాలుగు లక్షలే ఉన్నట్టు రికార్డుల్లో చూపుతున్నారని చెప్పారు. రాయలసీమ జిల్లాలతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో ఊరు పేరుతో పేరున్న వ్యక్తులు హిందువులుగా పరిగణించ బడుతున్నారని తెలిపారు. అందువల్ల జనగణనలో తమకు తగిన గుర్తింపు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో షేక్ వలి, మీరావలి, మార్కెట్ జానీ పాల్గొన్నారు.

ఆర్‌విఆర్‌లో ప్రొటోటైప్ ఛాలెంజ్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులు ఆవిష్కర్తలుగా అభివృద్ధి చెందినప్పుడే అభివృద్ధి సాధ్యమని హైదరాబాద్‌కు చెందిన ప్రాగ్మాటిక్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఫౌండర్ అండ్, సిఇఒ భరత్ గుజవర్తి అన్నారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో శనివారం ఇన్నో ఫోర్జ్ ఐడియేట్ అండ్ ప్రొటోటైప్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రోటోటైప్ ఛాలెంజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన యంత్ర పరికరాల నమూనాలను ప్రదర్శించి, వాటి పనితీరు సామర్థ్యాన్ని, అందులో ఉపయోగించే వివిధ రకాల ఇంధన, రసాయన తదితర వినియోగ వస్తువులను గురించి, అందుకు అంచనా వ్యయాన్ని, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. స్మార్ట్ ఎడ్యుకేషన్, బయోటెక్, హెల్త్‌టెక్, వ్యవసాయం ఆహార ఉత్పత్తి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్మార్ట్ ఆటోమేషన్, రోబోటిక్, డ్రోన్లు, స్మార్ట్‌వెహికల్స్, క్లీన్ అండ్ గ్రీన్‌ఎనర్జీ, రేనేవబుల్ ఎనర్జీ, ఫిట్నెస్ అండ్ స్పోర్ట్స్, సైబర్ సెక్యూరిటీ, తదితర అంశాలపై విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల పరికరాల నమూనాలను ప్రదర్శించడంతో పాటు, పలు అంశాలపై వారి ఆలోచనలను, విపత్తు సమయాలలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులు వివరించారు. విద్యార్థులు

విద్యార్థులు రూపొందించిన నమూనాలు పరిశీలిస్తున్న భరత్

తమ ఆలోచనలను ప్రయోగాత్మకంగా విజయం సాధించే దిశగా నిత్యం కృషి చేయాలని ఆర్‌వి.ఆర్ అండ్ జె.సి. ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కళాశాల సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ రాయ పాటి గోపాలకృష్ణ సూచించారు. దేశానికి ఉపయోగపడే ఆవిష్కరణలకు తగిన సహాయ సహకారాలు అందించేందుకు తమ కళాశాల యాజమాన్యం సిద్ధంగా ఉందని కళాశాల ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ చెప్పారు. ఈ నందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్‌వి.శ్రీనివాసరావు, ప్రోగ్రాం కన్వీనర్లు డాక్టర్ కె.కార్తీకపవన్, డాక్టర్ సి.హెచ్.అపర్ణ పాల్గొన్నారు.

స్వీప్ కార్యక్రమంపై జెసి సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

స్వీప్ కార్యక్రమంపై నోడల్ ఆఫీసర్లు, ఇఆర్ఒలు, స్వీప్ కార్యక్రమంపై నియమితులైన స్పెషల్ ఎఇఆర్ఒలు, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో జిల్లా సంయుక్త కలెక్టర్ సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావుతో కలిసి శనివారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ జిల్లాలోని యునివర్సిటీలు, కళాశాలలు, ఇతర విద్యా సంస్థలలో అవగాహనా సదస్సు నిర్వహించి, ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగించుకోటంలో భాగస్వామ్యం పెంపుదలకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులకు ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై ర్యాలీ, వ్యాసరచన, వక్తృత్వం, రంగోలి, షార్ట్‌ఫిల్మ్, స్కిట్స్, పరుగు పోటీలు నిర్వహించాలన్నారు.

17 ఏళ్ల వయస్సు నిండిన విద్యార్థులు కూడా ఓటరు నమోదు కొరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్వీప్ నోడల్ ఆఫీసర్‌గా వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ, ఏడీని నియమించినట్లు చెప్పారు. అర్హతగల అర్జీదారులు ఓటు నమోదుకు Voter HelplineApp ద్వారా గానీ, https://voters.eci.gov.inద్వారా గానీ సంబంధిత బిఎల్ఒకు దరఖాస్తు అందచేయాలన్నారు. సమావేశంలో స్వీప్ నోడల్ ఆఫీసర్ సి.హెచ్. సువార్త, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధికారులు పాల్గొన్నారు.

నేడు యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

యుటిఎఫ్ గుంటూరు జిల్లా 49వ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం పొన్నూరులోని జెఎంఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కానుంది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, ఎస్‌టిఎఫ్ఐ జెండాను యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎఎన్ కుసుమకుమారి, యుటిఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు జి.మోహన్‌రావు ఆవిష్కరిస్తారని జిల్లా కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. 10 గంటలకు నిర్వహించే సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి అధ్యక్షత వహిస్తారని, ప్రతినిధుల సభ, నివేదికలు, చర్చ, ఆమోదం, తీర్మానాలు, నూతన కమిటీ ఎన్నిక వరుసగా జరుతాయని తెలిపింది.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం తాడేపల్లి శాఖ గ్రంథాలయంలో 6, 7 తరగతులు జూనియర్స్ విభాగంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాలు ప్రాముఖ్యత, పుస్తక పఠనం అంశాలపై ఈ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో బి.నాగరాజు, బి.లక్ష్మీ పద్మావతి, గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్‌బాష పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం చిత్తు

ప్రజాశక్తి-తాడేపల్లి

మాదక ద్రవ్యాల అలవాటుతో జీవితం చిత్తు చేసుకోవద్దని విద్యార్థులకు నవజీవన్ బాలభవన్ జోనల్ కో-ఆర్డినేటర్ బి.రమేష్ సూచించారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా పెనుమాక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల శారీరక, మానసిక సమస్యలపై శనివారం అవగాహన కల్పించారు. ఇదే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పెనుమాక ప్రభుత్వ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బి.రవి కుమార్, ఉపాధ్యాయులు జి.శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ క్రీడోత్సవాలు

ప్రజాశక్తి - తాడికొండ

బాల్యం అనేది చాలా అద్భుతమైన వరమని ఎన్‌సిసి గ్రూప్ కమాండర్ హెడ్ క్వార్టర్ కల్నల్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని లాం గ్రామ శివారులో గల ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రెండవ వార్షిక క్రీడోత్సవాలను శనివారం నిర్వహించగా కల్నల్ చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బాల్యంలో చక్కటి క్రీడలు ఆడటం వలన క్రమశిక్షణ, దీక్ష పట్టుదల వంటివి అలవడతాయని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ క్రీడలు అనేవి సీబీఎస్ఈ కార్యక్రమంలో భాగంగా ఉన్నాయని, క్రీడలు బాల్యం నుండే అలవాటు చేసుకుంటే చక్కని ఆరోగ్యంతో పాటు శారీరిక వికాసం, మానసిక వికాసం రెండూ కలుగుతాయని తెలిపారు. క్రీడల్లో నైపుణ్యం కనపరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు, పాఠశాల ప్రో వైస్ చైర్మన్ చుక్కపల్లి రమేష్, డైరెక్టర్లు చుక్కపల్లి రాకేష్, ప్రియాంక పాల్గొన్నారు.

కలెక్టర్ ను సత్కరిస్తున్న జర్నలిస్టులు

కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన అధికారులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పుట్టిన రోజు సందర్భంగా కలెక్టరేట్ ఉద్యోగులు రెవిన్యూ అధి. కారులు, పట్టణ ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రెవిన్యూ ఉద్యోగుల సంఘం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను కలిసి నరసరావుపేట ప్రెస్ క్లబ్ తరపున జర్నలిస్టులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేకు జర్నలిస్టుల వినతి

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం ఇచ్చిన జీవోను సవరణ చేసి ప్రతి జర్నలిస్టుకు ఇంటి మంజూరు చేయాలని జర్నలిస్టు సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డికి వినతి పత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని , అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం వచ్చేలా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో ఎపియుడబ్ల్యూజె పల్నాడు జిల్లా అధ్యక్షులు నంద్యాల జగన్మోహన్ రెడ్డి, యూనియన్ నాయకులు నాగరాజు,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చైకం రమణారెడ్డి, జర్నలిస్టులు,శివ, అంజి, నాగరాజు, సాంబశివరావు, మల్లికార్జున,రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : సమాజం అభివృద్ధిలో ఆర్యవైశ్యులు భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. నరసరావుపేటలోని వాసవి కళ్యాణ మండ పంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి కుల, మత, పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు లబ్ది చేకూరేలా సుపరిపాలన సాగిస్తోందన్నారు. రాష్ట్రంలో ఆర్య వైశ్యులు రాజకీయంగా రాణించాలనేది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంకల్పమన్నారు. అందుకు అనుగుణంగానే వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు కార్య క్రమాలు చేపట్టారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్య వైశ్యులకు ప్రత్యేక గుర్తింపు దక్కిందని గుర్తు చేశారు. గతంలో వెల్లంపల్లి శ్రీనివాసరావుకు మంత్రి పదవి, ప్రస్తుతం డిప్యూటీ స్పీకర్ గా ఆర్యవైశ్య సామాజిక వర్గానికి ఇచ్చిన గౌరవంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మిట్టపల్లి వెంకట కోటేశ్వరావు, కెపి రంగారావు,రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఊరా భాస్కరరావు, పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఎన్. ఈ. సి కళాశాలల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, ఆర్యవైశ్య పెద్దలు మాజేటి సాంబశివరావు, నిడమనూరు సురేంద్ర, కెకె, విఎస్పీ సాంబ, కొత్తూరు కిషోర్, దివ్వల రామకృష్ణ, గాదంశెట్టి రామకృష్ణ, జ్ఞానేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

బూత్ లెవల్ ఆఫీసర్లు సరిగా పనిచేయాలి

ప్రజాశక్తి-అమరావతి

బూత్ లెవెల్ ఆఫీసర్లు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ అన్నారు . మండల కేంద్రమైన అమరావతిలోని ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాల్లో శనివారం బూత్ లెవెల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ఎలక్షన్,ఎలక్ట్రో రూల్స్ క్లెయిమ్స్ పై 10 కంటే ఎక్కువ ఉన్న కుటుంబాల్లో ప్రత్యేక శ్రద్ధ తో సర్వే చేయాలని అన్నారు. చనిపోయినవారు ఉన్నట్లయితే నోటీస్ బి ఇచ్చి ఫారం 7 తో అప్డేట్ చేయాలని చెప్పారు. వారం రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని బూత్ లెవెల్ ఆఫీసర్లు ను కోరారు. ఎన్నికల నిర్వహణలో కొత్త ఓటర్ల చేరిక, యువతీ,యువకుల కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అమరావతి తహాశీల్దార్ కార్యాలయాన్ని శ్యాం ప్రసాద్ తనిఖీ చేశారు. ప్రాధాన్యత క్రమంలోని ఐటమ్స్ ను సకాలంలో పూర్తి చేయాలని, ఫేజ్ 3 రీ సర్వే ఐటమ్స్ త్వరితగతన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అమరావతి ఎంపీడీవో ఉమాదేవి, తహాశీల్దార్ లు విజయశ్రీ, క్షమారాణి, జియా పాల్గొన్నారు.

నల్లపాటి ట్రస్ట్ ఆధ్వర్యంలో జాబ్ మేళా

200 మంది అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నల్లపాటి భరోసా పేరుతో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి ట్రస్ట్ వ్యవస్థాపకులు నల్లపాటి రామచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పల్నాడు రోడ్డులో గల ఎస్.ఎస్.ఎన కళాశాల ఆడి టోరి యంలో శుక్ర,శని వారాలలో 2 రోజుల పాటు కొనసాగిన జాబ్ మేళాకు 1600 మందికి పైగా నిరుద్యోగ యువతి యువ కులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలైన యాక్సిస్ బ్యాంక్, ఫ్లిప్ కార్ట్, వాల్ మార్ట్, పేటిఎం, ఇంకో, కోడ్ యంగ్, ఫ్లూటెక్, యులెర్న్ తదితర కంపెనీ ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో దాదా పు 1600కు పైగా నిరుద్యోగ యువతీ, యువకులు ఇంటర్వ్యూ కోస పేర్లు నమోదు చేసుకోగా 700 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.అందులో 200 మంది అభ్యర్థులను వారి సమర్థత,అర్హతలు బట్టి కంపెనీ ప్రతి నిధులు ముందస్తు జాబితా రూపొందించుకున్నారు. ఇంటర్వ్యూలో ప్రతిభ చాటిన అభ్యర్థులకు త్వరలో నియామక పత్రాలు ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రతి ని ధ ు ల ు ప్రకటించారు. ఈ సందర్భంగా నల్లపాటి రామ చంద్ర ప్రసాద్ మాట్లా డుతూ అభ్యర్థులు అధిక సంఖ్యలో వచ్చిన నేపథ్యంలో అందరికీ ఇంటర్వ్యూలు నిర్వహించ డం సాధ్యం కాలేదని అర్హత సామర్థ్యం ఆధారంగా ఆయా కంపెనీ ప్రతి నిధులను సోమవారం నుండి ఎప్పు డైనా సంప్రదిస్తే ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు నల్లపాటి భరోసా పేరుతో ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహించిన ఆయా కంపెనీల ప్రతి నిధులను రామచంద్ర ప్రసాద్ ఘనంగా సత్కరించారు. నిర్ణ యించుకున్న అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నల్లపాటి ట్రస్ట్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించడం పట్ల యువత కృతజ్ఞతలు తెలిపారు.



ఆయా కంపెనీల ప్రతినిధులను సత్కరిస్తున్న నల్లపాటి రామచంద్ర ప్రసాద్

'అధికారం అండతో రూ.వందల కోట్లు దోపిడి'

ప్రజాశక్తి-ఈపూరు

అధికారాన్ని ఆదాయంగా మలుచుకొని వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్న ఘనుడు బొల్లా బ్రహ్మనాయుడు అని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆరోపించారు. మండలంలోని నల్లగొండ తండా, ఎర్రకుంట తండా, బొమ్మరాజు పల్లి తండాలలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ శాశ్వత మంచినీటి పథకానికి బొల్లా బ్రహ్మనాయుడు తూట్లు పొడిచారని అక్రమ వెంచర్లు, మద్యం,ఇసుక, మట్టి మాఫియా వ్యాపారం చేస్తూ దోపిడీకి పాల్పడ్డారన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు,సీనియర్ నాయకులు గన్నమనేని వెంకయ్య, మండల పార్టీ అధ్యక్షులు తిరుమల శెట్టి బాలయ్య, నర్రా కిషోర్, గోపి నాయక్, ప్రసాద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

30 గంటల దీక్షను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - నరసరావుపేట

కృష్ణా జలాల పున్ణ పంపిణీ నోటిఫికేషన్ రద్దు చేయాలని, రాష్ట్రంలో కరువు ప్రాంతాలను ఆదుకోవాలని, నవంబర్ 20,21వ తేదీల్లో విజయవాడలో జరిగే 30 గంటల నిరసన దీక్షలను జయప్రదం చేయాలని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ కోరారు.నిరసన దీక్షలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం నరసరావుపేటలోని సిపిఐ కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోవు రోజులలో దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ కు కృష్ణా నదికి సంబంధించి నికర జలాలు , మిగులు జలాలు రావని, పర్యవసానంగా కడప. అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, తిరుపతి ,నంద్యాల, కర్నూలు, నెల్లూరు,ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాలలో 56 లక్షల ఎకరాల సాగు భూమి బీడు భూములుగా మారతాయని అన్నారు. కృష్ణా నదిపై రాష్ట్రంలో నిర్మించిన, నిర్మాణంలో ఉన్న కృష్ణా డెల్టా, నాగార్జునసాగర్, కుడి, ఎడమ కాలువలు, తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, ఎస్సార్ బీసీ, వెలిగొండ, కేసీ కెనాల్, తుంగభద్ర లో లెవెల్ కెనాల్, తుంగభద్ర హై లెవెల్ కెనాల్ మొత్తం 10 ప్రాజెక్టులు నిరుపయోగం అయిపోతాయన్నారు. కృష్ణా జలాల విషయమై రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి పోరాటం చేయకపోతే చరిత్ర హీనుడుగా మిగిలిపోతాడని వారు హెచ్చరించారు.

రొంపిచర్లను కరువు మండలంగా ప్రకటించండి

ప్రజాశక్తి-రొంపిచర్ల

రొంపిచర్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శనివార సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సరైన వర్షాలు కురవక రైతులు పండించిన పంటలకు నీరులేక ఎండిపోతున్నాయని అన్నారు రాష్ట్రంలో కరువు సమస్యను తక్షణమే పరిష్కారం చేయాలని అన్నారు. అనంతరం సిపిఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు మాట్లాడారు. అనంతరం తహశీల్దారు జి.అంకారావుకు వినతి పత్రం అందజేశారు. తొలుత స్థానిక చెరువు కట్ట సెంటర్ నుండి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి ఏరియా కార్యదర్శి షేక్ చిన్న జాన్ సైదా, సిపిఐ మండల కార్యదర్శి రొడ్డా అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే ను పకడ్బందీగా నిర్వహించండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రీ సర్వే రికార్డులను పరిశీలిస్తున్న జెసి శ్యామ్‌ప్రసాద్

భూములు రీసర్వే ను పకడ్బందీగా నిర్వహించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సత్తెనపల్లి తహ శీల్దార్ కార్యా లయంలో భూములు రీసర్వే పురోగతిని జాయింట్ కలెక్టర్ శనివారం సమీక్షించారు. సత్తెనపల్లి మండలంలో గ్రామాల్లో జరగుచున్న భూములు రీ-సర్వే ఏ విధంగా చేస్తున్నారో, సర్వే రికార్డులను పరి శీలించారు అనంతరం సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గం లో జీరో డోర్ నంబర్ ల క్లెయిమ్స్, 10 కన్నా ఎక్కువ ఒటర్లు గల డోర్ నంబర్లపై, పెండింగ్ క్లెయిమ్స్, ఒటర్ల జాబితా ప్యూరిపికేషన్, అంశాల పై ఎన్నికల సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ రాజకుమారి తహసిల్దార్ సురేష్ పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయలో జెసి తనిఖీ

ప్రజాశక్తి- పెదకూరపాడు

పెదకూరపాడు మండల తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. మండలంలో జరుగుతున్న రీ సర్వే పనులపై ఆరా తీశారు.సర్వే పనుల్లో పెండింగ్ లేకుండా అన్ని పనులను పూర్తి చేయాలని తహశీల్దారును, సర్వేర్ లను ఆదేశించారు.ఎలక్షన్ పనులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని ఆదేశించారు..నూతన ఓటర్లను చేర్పించాలని యువతీ యువకుల పేర్లను కొత్తగా నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పెదకూరపాడు తహశీల్దార్ జియా, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట నియోజకవర్గంలో సోమవారం జరగనున్న సామాజిక సాధికార యాత్రను విజ యవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సామాజిక సాధికార యాత్ర నరసరావుపేటలో జరగనున్న నేపథ్యంలో నియోజకవర్గ ముఖ్య నాయ కులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణం, ప్రతి గ్రామం నుంచి వందలాదిగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలని పిలుపు నిచ్చారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు ఎస్ఆర్‌కెటి కాలనీ నుంచి పాద యాత్ర ప్రారంభం కానున్నట్లు చెప్పారు. పల్నాడు బస్టాండ్‌లో భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలో సంతగుడిపాడు, రొంపిచర్ల గ్రామాల్లో గల శాఖా గ్రంథాలయాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదవరోజైన శనివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. మండలంలో సంతగుడిపాడు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రామంలో గల అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరుగు పందెం, మ్యూజికల్ ఛైర్స్, వంటి పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రొంపిచర్ల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు బాల్ బాడ్మింటన్, మ్యూజికల్ ఛైర్స్ వంటి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా శాఖా గ్రంథా లయాధికారులు కె.వెంకట్రావు, సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అవుట్‌ఫాల్ డ్రెయిన్ పనులను వేగవంతం చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తూర్పు నియోకవర్గంలోని పలు ప్రాంతాల ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి ఏటుకూరు రోడ్డులోని బందావన్ అపార్ట్మెంట్ పక్క నుండి అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టామని, పనులను కాంట్రాక్టర్ వేగవంతం చేయడానికి ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి ఏటుకూరు రోడ్డులోని బృందావన్ అపార్ట్మెంట్ వద్ద అవుట్ ఫాల్ డ్రెయిన్ పనులు, నల్లచెరువు వాకింగ్ ట్రాక్‌లో అభివృద్ధి పనులను కమిషనర్ శనివారం పరిశీలించారు. తూర్పు నియోజకవర్గంలోని అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మాణం వలన ప్రదానంగా పట్నంబజార్, పూల మార్కెట్, ఏటుకూరు రోడ్డు, లాంచస్టర్ రోడ్డు, సంగడిగుంట, ఎల్.ఆర్.కాలనీ, కబాడీగూడెం తదితర ప్రాంతాల్లో వర్షాలకు నీరు వెళ్లే అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లు సరిగా లేక పోవడం వలన వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య శాశ్వత పరిష్కారానికి ఏటుకూరు రోడ్డులోని బృందావన్ అపార్ట్మెంట్ పక్క నుండి అవుట్ ఫాల్ డ్రెయిన్‌ని రూ.3.53 కోట్లతో 850 మీటర్లు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పనుల వేగవంతం చేయడానికి ఎక్కడైనా ఆక్రమణలుంటే తొలిగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్ నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగంగా చేసేలా పర్యవేక్షించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం నల్లచెరువు వాకింగ్ ట్రాక్‌లో అభివృద్ధి పనులను పరిశీలించి, పనుల పురోగతిపై ఎఇని వివరాలు అడిగి ప్రహరి నిర్మాణం వేగంగా చేపట్టాలన్నారు. పరిశీలనలో ఎస్ఇ భాస్కర్, డిసిపి కోటయ్య, కార్పొరేటర్లు వి.జ్యోతి పద్మజ, ఎస్.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు నూరి ఫాతిమా, ఇఇ కోటేశ్వరరావు, టిపిఎస్‌లు సువర్ణకుమార్, గోవర్ధన్, డిఇఇ శ్రీధర్, ఎఇ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డిఇఇ రమేష్

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం అందరి బాధ్యత

ప్రజాశక్తి - చేబ్రోలు

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం అందరి బాధ్యతని ఆర్‌డబ్ల్యూఎస్ డిఇఇ రమేష్ అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మండలంలోని వడ్లమూడి గౌడపాలెం ప్రాథమిక పాఠశాలలో శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఇ రమేష్ మాట్లాడుతూ మలమూత్ర వ్యర్థాళ నిర్వహణ లోపం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, పేదలు దీన్ని అధిగమించడం కోసం ప్రభుత్వం ప్రతి ఇంటికీ మరుగుదొడ్లను నిర్మిస్తోందని చెప్పారు. ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వైపిఎ ప్రసాద్, జిల్లా కో-ఆర్డినేటర్ షఫీ, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ సాయి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ శ్రీనివాసరావు, మండల కో-ఆర్డినేటర్ జి.ప్రసాదరావు పాల్గొన్నారు.

మందులు అందిస్తున్న వైద్యులు

ప్రకృతి వైద్యంపై అవగాహన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : జాతీయ ప్రకృతి చికిత్స దినోత్సవం సందర్భంగా పెదవడ్లపూడిలోని లూథరన్ చర్చి వద్ద శనివారం సమావేశం నిర్వహించారు. ప్రకృతి వైద్యంపై ప్రకృతి వైద్యశాల వైద్యులు శ్రీ రామానంద, ఆయుర్వేద వైద్యులు సునీత, డాక్టర్, రమేష్, డాక్టర్ సతీష్ అవగాహన కల్పించారు. ఎక్కువ మంది బిపి, షుగర్, నొప్పులతో భాద పడే వారికి సహజ జీవన విధానము, ఆహార అలవాట్లు గురించి తెలిపి ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు.

పెదకాకాని ఆలయానికి హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

స్థానిక శివాలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి వి.గోపాలకృష్ణారావు దంపతులు శనివారం సందర్శించారు. పాలక మండల చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, సభ్యులు, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఆది, సోమవారాల్లో సందర్శకుల రద్దీ దష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, పాలకమండలి చైర్మన్ శివశంకరరావు తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాలపై పరిశీలన

ప్రజాశక్తి - తెనాలి

శాఖా గ్రంథాలయాలలో ఈనెల 14 నుంచి నిర్వహిస్తున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ శాఖ ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో గ్రేడ్-1 లైబ్రేరియన్ కె.రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాలను గ్రంథాలయ శాఖ ఉపసంచాలకులు షేక్ పీర్ అహ్మద్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి (ఎఫ్‌ఎసి) కె.ఝాన్సీలక్ష్మి పరిశీలించారు. ప్రారంభం నుంచి ఇప్పటివరకు విద్యార్థులకు వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల వివరాలను తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. వారోత్సవాల్లో భాగంగా శనివారం క్యారమ్స్ పోటీలు నిర్వహించినట్లు లైబ్రేరియన్ తెలిపారు.

ప్రజాశక్తి - మంగళగిరి

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం మంగళగిరి శాఖా గ్రంథాలయంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో 200 మంది పాల్గొనగా న్యాయ నిర్ణేతలుగా డిఎస్‌కె శర్మ, వై.నాగకుమారి వ్యవహరించారు. గ్రంథాలయ సిబ్బంది ఎన్.ఆరోగ్యం, పి.కృష్ణ, ఎస్ఎల్ఎం చైతన్య హై స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

విద్యార్థులు చిన్ననాటి నుండి గ్రంథాలయానికి వెళ్లడం అలవాటు చేసుకోవాలని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ రెజీనా సూచించారు. గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, గ్రంథాలయాల ప్రాముఖ్యత అనే అంశంపై జూనియర్స్‌కు, సమాజంపై సాంకేతిక ప్రభావం అనే అంశాలపై సీనియర్స్‌కు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలి

దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి-తెనాలి

పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ పాటించాలని, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలని మున్సిపల్ అధికారులు ప్రజలను కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయించే షాపులను, వాటిని ఉపయోగించే షాపులను మునిసిపల్ ప్రజారోగ్య సిబ్బంది శనివారం తనిఖీ చేశారు. ప్రతి రోజూ తనిఖీలు చేసి, అపరాధ రుసుములు వసూలు చేస్తామన్నారు. ఒకసారి పట్టుబడిన తరువాత మళ్లీ రెండవసారి దొరికితే షాపులకు రెట్టింపు అపరాధ రుసుం వసూలు చేయటంతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా మటన్, చికెన్ షాపులకు వెళ్లేటప్పుడు స్టీల్ బాక్స్‌లను తీసుకెళ్లాలని, మటన్, చికెన్ షాపుల వ్యాపారులు అరటి ఆకుల్లో, విస్తరాకుల్లో మాంసాన్ని ప్యాక్ చేసి వినియోగదారులకు విక్రయించాలని కోరారు. గాంధీచౌక్ ఏరియాలోని షాపులలో మునిసిపల్ సిబ్బంది తనిఖీలు చేసి, నిషేధించిన ప్లాస్టిక్‌ను స్వాధీన పరచుకుని, అపరాధ రుసుం వసూలు చేశారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్లు ఎ.రామచంద్రరావు, ఎం.సుబ్బారావు, శానిటేషన్ సెక్రటరీలు వి.రవీంద్ర, ఎస్.బాబురావు, వి.విజయచంద్ర, టి.సుష్మ, కె.నాగజ్యోతి, నగర దీపికలు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో గ్యార్మి వేడుక

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

వడ్డేశ్వరంలో శనివారం టిడిపి ఆధ్వర్యంలో గ్యార్మి పండుగ వేడుక ఘనంగా జరిగింది. అనంతరం అలంకరణ చేసిన జెండాను ఊరేగించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కె.మధుసూదనరావు, గ్రామ అధ్యక్షులు ఇ.బాబు, నాయకులు వి.అబ్రహం, ఎస్‌కె.నాగూర్‌వలి, కె.లక్ష్మణరావు, కె.సురేష్, పి.అజీజ్ ఖాన్, షేక్ జానీ పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు నేడు ఇ-శ్రమ కార్డులు నమోదు

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కార్మిక శాఖ ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మికుల ఇ-శ్రమ కార్డులు నమోదు కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి నులకపేట తహశీల్దార్ కార్యాలయంలో చేయనున్నట్లు మంగళగిరి అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్డు పొందుటకు ఇఎస్ఐ, ఇపిఎఫ్ లేని అసంఘటిత కార్మికులంతా అర్హులేనని తెలిపారు. 16-59 ఏళ్లున్న భవన ఇతర నిర్మాణ కార్మికులు, వలస కార్మికులు, ఇంటి పని చేసే వారు, వ్యవసాయ కూలీలు, వీధి విక్రేతలు, ఆశా, అంగన్వాడీ వర్కర్స్, మత్స్యకారులు, తోట పని కూలీలు, ఉపాధి హామీ కూలీలు, పాల విక్రేతలు, తోపుడు బండ్ల వ్యాపారులు, ఇతర లఘు వ్యాపారులు మొదలగువారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకునే వారు ఆధార్ కార్డు, బ్యాంకు ఎకౌంట్, ఫోన్ నంబర్ తీసుకురావాలని సూచించారు.

విద్యార్థులతో ఉర్దూ డిఐ ఖాసిం, ఉపాధ్యాయులు

ఉర్దూ పాఠశాలలను సందర్శించిన డిఐ ఖాసిం

ప్రజాశక్తి-గుంటూరు

వట్టిచెరురుకూరు మండలం, పుల్లడిగుంటలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎస్.కె.ఎమ్‌డి.ఖాసిం శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నో బ్యాగ్‌డే సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు కృత్యాలను పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. ప్రత్తిపాడు మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను సందర్శించి జగనన్న గోరుముద్ద ఆహార పదార్థాలను పరిశీలించారు.

దీపావళి కవితల పోటీ విజేతగా ఆళ్ల నాగేశ్వరావు

ప్రజాశక్తి - తెనాలి

దీపావళి సందర్భంగా నెల్లూరుకు చెందిన మనుమసిద్ధి కవన వేదిక వాట్సాప్ సమూహం ఇరు తెలుగు రాష్ట్రాల స్థాయిలో 'వెలుగుల వర్షం' అంశంపై నిర్వహించిన వచన కవితల పోటీలలో పట్టణానికి చెందిన చెందిన కవి ఆళ్ల నాగేశ్వరరావు విజయం సాధించారు. దివ్య భవ్య దీపావళి శీర్షికన ఆయన రచించిన కవితకు నిర్వాహకులు దుప్పటి రమేష్ బాబు, నల్లు రమేష్, జగన్నాథం రామమోహన్ వాట్సాప్ వేదికగా విజేతగా ప్రకటించినట్లు ఆళ్ల నాగేశ్వరరావు తెలిపారు. వృత్తి పరంగా గుంటూరు-2 డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావు సాహితీ రంగంలో చేస్తున్న కృషిని పలువురు అభినందించారు.

ఆలపాటి పెళ్లి కానుక అందజేత

ప్రజాశక్తి- తెనాలిరూరల్

స్థానిక 28వ వార్డుకు చెందిన తిరుమల శ్రీనివాసరావు, భాగ్య లక్ష్మి దంపతుల కుమార్తె నాగ సింధూరకు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పెళ్లి కానుక అందజేశారు. సింధూర వివాహం సందర్భంగా ఆమెకు చీర, సారేతో పాటు మంగళ సూత్రాన్ని టిడిపి నాయకులు బహూకరించారు. గత జూన్ మాసం నుంచి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఉచితంగా పెళ్లి కానుకను అందిస్తున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రావి కృష్ణమోహన్, కల్లు రాజా పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందచేస్తున్న అతిథులు

చిప్స్‌లో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజిలో క్వాలిటీ బై డిజైన్ ఏ రోడ్‌మ్యాప్ ఫర్ క్వాలిటీ ఫార్మాసూటికల్ ప్రొడక్ట్స్ అనే అంశంపై రెండ్రోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర మాట్లాడుతూ మనం రోజువారీ వినియోగించే ఔషధాలను ప్రభుత్వంగానీ, ఎఫ్‌డిఎ నిషేధించడంగానీ, బహిరంగ మార్కెట్ నుండి రీకాల్ చేయడం అప్పుడప్పుడు జరుగుతూ ఉంటుందన్నారు. దీనికి కారణం సదరు ఔషదాల తయారీ ప్రక్రియలో గుర్తించలేని లోపాలు తదనంతర పరిశోధనల్లో బహిర్గతం కావడం, ఆ లోపాల వల్ల ఆ ఔషదాలు మానవాళి ఆరోగ్యంపై దుష్ప్రభావాలు చూపించడమని చెప్పారు. అధునాతన క్యూబిడి సాంకేతిక విధానం ద్వారా ఔషధాల తయారీ ప్రక్రియ దశలో ఉత్పన్నమయ్యే అతి సూక్ష్మలోపాలను రూపకల్పన దశలోనే సరిదిద్దే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. ఈ ప్రాధాన్యతను గుర్తించే క్యూ.బి.డి అంశంపై సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. రెండవ రోజు సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎ.పి.టి.ఐ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.వెంకటరణ, ఎ.పి.టి.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వై.అంకమ్మచౌదరి, ఐ.పి.జి.ఎ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పి.శ్రీనివాస్ బాబు, ఐ.పి.ఎ రాష్ట్ర సెక్రెటరీ డాక్టర్ ఎమ్.ప్రసాదరావు హాజరయ్యారు. అంతర్జాతీయ సదస్సులో సమర్పించిన పరిశోధనా పత్రాల్లో ఉత్తమ పరిశోధనా పత్రాలు సమర్పించిన 16 మంది రీసెర్చ్ స్కాలర్లకు అతిథులు ప్రశంశా పత్రాలు, బహుమతులు అందచేశారు.

విద్యార్థుల ప్రగతి కోసం సమగ్ర వార్షిక ప్రణాళిక

రూపకల్పనపై పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి సమావేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్

పిల్లల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని వారి అభివృద్ధికి ఉపకరించే చక్కని వార్షిక ప్రణాళికలను తయారు చేయాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్ర శిక్ష పథక అధికారి కె.శామ్యూల్ చెప్పారు. వార్షిక బడ్జెట్ ప్రణాళిక 2024-25 తయారీపై నరసరావుపేట పట్టణ సమీపంలోని శంకర భారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సమావేశంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ రానున్న ఏడాది నాటికి పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు, విద్యార్థుల ప్రగతికి అవసరమైన వార్షిక ప్రణాళికలను జాగ్రత్తగా తయారు చేయాలని సూచించారు. పిల్లలకు అతి ముఖ్యమైన వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ విద్య హక్కు చట్టానికి అనుగుణంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు చేరువగా, నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు దిశగా ప్రణాళికలు ఉండాలన్నారు. బడి బయట పిల్లలను, వికలాంగ పిల్లలను, అట్టడుగు సామాజిక తరగతులకు చెందిన పిల్లలను దృష్టిలో ఉంచుకొని మెరుగైన ప్రణాళికల కోసం పాఠశాల అభివృద్ధి కమిటీలతో చర్చించి వార్షిక బడ్జెట్ ప్రణాళికలను తయారు చేయాలని చెప్పారు. ఎఎస్ఒ పద్మారావు మాట్లాడుతూ ప్రణాళికను కచ్చితమైన సమాచారంతో రూపొందించాలన్నారు. ప్రణాళిక రూపకల్పనలో పాఠశాల, గ్రామ స్థాయి, మండల స్థాయిలో విద్యాశాఖ అనుబంధ శాఖల అధికారులను, సిబ్బందిని సంప్రదించి సహకారం తీసుకోవాలన్నారు. 20వ తేదీన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, 22, 23 తేదీల్లో హాబిటేషన్ స్థాయిలో గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రణాళికలను ఆమోదింపజేసుకోవాలని చెప్పారు. 24వ తేదీన మండల విద్యాప్రణాళిక తయారు చేసి జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయానికి పంపాలని, ప్రణాళికను తయారు చేసుకోడానికి 2022-23 యు డైస్ డేటాను ఉపయోగించాలని సూచించారు. ఎపిఒ శంకరరాజు మాట్లాడుతూ క్రింది స్థాయి నుండి వచ్చే సమాచారం పక్కాగా ఉంటేనే జిల్లా స్థాయి ప్రణాళిక తయారు అవుతుందన్నారు. పాఠశాల విద్యా ప్రణాళికను ఎఎస్ఒ పద్మారావు, హాబిటేషన్ ప్రణాళికను ఎఎల్ఎస్ కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు, క్లస్టర్ స్కూల్ ప్రణాళికను ఎఎంఒ పి.శ్రీనివాసరావు, మండల విద్యా ప్రణాళికను తివిక్రమ్ వివరించారు. బాల కార్మికులను, బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. సమావేశంలో సిడిపిఒ, జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయి పేటెంట్

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి జాతీయస్థాయి పేటెంట్ మంజూరైనట్లు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ జీ.శ్రీనివాసరావు, జేఎన్‌టీయూ కాకినాడలోని ఈఈఈ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రొఫెసర్ ఎస్.శివనాగరాజు సంయుక్తంగా ప్రతిపాదించిన 'హైబ్రిడ్ ఆటో రిక్షా' అనే అంశానికి ప్రముఖ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఇండియా అథారిటీ పేటెంట్‌ను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. వీరు ప్రతిపాదించిన ఈ పేటెంట్‌కు 20 ఏళ్లపాటు హక్కులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ పేటెంట్ వల్ల హైబ్రిడ్ ఆటో రిక్షాల సహాయంతో దేశంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శబ్ధ, కాలుష్య రహిత రవాణా వ్యవస్థను అందించవచ్చన్నారు. ఆటో రిక్షాల నిర్మాణంలో గణనీయమైన మార్పులు అవసరం లేకుండా ఎలక్ట్రిక్ హైబ్రిడ్ ఆటో రిక్షాను అభివృద్ధి చేయవచ్చని, అదే సమయంలో సోలార్ బ్యాటరీ చార్జ్ సిస్టమ్ సహాయంతో విద్యుత్‌శక్తిని కూడా ఆదాచేయవచ్చని వివరించారు. దీని సహాయంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఉపాధి అందించవచ్చన్నారు. జాతీయ స్థాయి పేటెంట్ పొందిన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ జీ.శ్రీనివాసరావును విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రొఫెసర్ శ్రీనివాసరావును అభినందిస్తున్న లావు రత్తయ్య, వర్సిటీ వీసీ

ఆక్సిజన్ థెరపీపై హిందూ ఫార్మసీలో సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

డాక్టర్ రామకృష్ణను సన్మానిస్తు అధ్యాపకులు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజిలో జాతీయ సేవా సంస్థ, ఫార్మసీ ప్రాక్టీసు విభాగం సంయుక్తంగా ఆక్సిజన్ థెరపీపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్ఆర్ మెడికల్ కాలేజి పల్మనాలజి విభాగాధిపతి, హిందూ ఫార్మసీ కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ ఆర్.రామకష్ణ మాట్లాడుతూ ఆక్సిజన్ ఆవిష్కరణ, తయారు చేసే విధానం, భద్రపరచటం, ఆహార పదార్థాల వినియోగంలో ఆక్సిజన్ పాత్ర గురించి వివరించారు. సిఒపిడి, హైపోక్సియా, డిస్పోనోయా లాంటి శ్వాస సంబంధిత వ్యాధులు, గుండెపోటు, అనీమియా, తీవ్రమైన కాలిన గాయాల చికిత్స మరియు కార్బన్ మోనాక్సైడ్ పాయిజనింగ్ చికిత్సకు ఉపయోగ పడుతున్నట్లు ఆక్సిజన్ థెరపీకి అవసరమైన మెడికల్ డివైజులు, వాటి వినియోగ పద్ధతులను గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మా.డి. డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య పాల్గొన్నారు.

8 నుండి అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి-గుంటూరు, పెదకాకాని రూరల్

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 8 నుండి జరిగే అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వై.నేతాజీ పిలుపునిచ్చారు. శనివారం సిఐటియు గుంటూరు నగర పశ్చిమ కార్యాలయంలో అంగన్‌వాడీ గుంటూరు వెస్ట్ 3, 4, 5 సెక్టార్స్ సమావేశం చిన వెంకాయమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం సందర్భంగా అంగన్వాడీలకు తెలంగాణ కంటే రూ.వెయ్యి అదనంగా జీతం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. 99 శాతం హామీలు అమలు చేశామని చెప్తున్నారని, మరి అంగన్వాడీలకు ఇచ్చిన హామీ ఎందుకు అమలు చేయలేదని అన్నారు. అంగన్వాడీలు ఐక్యంగా ఉద్యమించిన ఫలితంగా రిటైర్ అయిన వర్కర్‌కు రూ.50 వేలు, హెల్పర్‌కు రూ.20 వేలు ఇస్తున్నారని, అయితే గ్రాట్యుటీ చట్ట ప్రకారం చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం చట్టాలను ఉల్లంఘిస్తోందని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు అమలుకు అంగన్వాడీలు ఐక్యంగా సమ్మె చేయటం ద్వారా ఈ ప్రభుత్వం మెడలు వంచాలని పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు గుంటూరు నగర తూర్పు, పశ్చిమ కమిటీల ప్రధాన కార్యదర్శులు కట్లగుంట శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా బి.ముత్యాలరావు, అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్.బాజీబి, చిన వెంకాయమ్మ, కోశాధికారిగా సుజాత, సహాయ కార్యదర్శిగా మొబీనా, ఉపాధ్యక్షురాలుగా మెర్సీగోల్డ్, మరో ఐదుగురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

గుంటూరు సమావేశంలో మాట్లాడుతున్న నేతాజి

మండల కేంద్రమైన పెదకాకానిలోని సిఐటియు కార్యాలయంలో కనకవల్లి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నేతాజితోపాటు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.శివాజి మాట్లాడుతూ అంగన్వాడీలకు సంక్షేమ పథకాలను రద్దు చేశారని, దళితులైన వారికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ నిలిపేశారని చెప్పారు. సెంటర్ అద్దెలు, బిల్లులు నెలనెలా చెల్లించని కారణంగా వాటిని అంగన్వాడీలు వారి జీతాల్లోనుండో, అప్పులు చేసో చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. ఆయా సమస్యలపై ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోగా నిర్బంధాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో అంగన్వాడి సమస్యలు పరిష్కారం, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని, అంగన్వాడి కేంద్ర పిల్లలకు యూనిఫారం, తల్లిదండ్రులకు అమ్మబడి అమలు చేయాలని కోరుతూ సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. సమ్మెకు ప్రజలంతా మద్దతివ్వాలని కోరారు. సమ్మెకు మద్దతు కోరుతూ వివిధ రంగాల ప్రజలకు, వినతిపత్రాలు ఇవ్వాలని, రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాలని, మండల కేంద్రంలో సమ్మె శిబిరం ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించారు. షబనా, తిరుమల, వెంకటేశ్వరమ్మ, నీరజ, ప్రభావతి, ధనశ్రీ, పావని పాల్గొన్నారు.

రోజాబాయికి ఎస్టీ కమిషన్ సభ్యుని పరామర్శ

ప్రజాశక్తి-గుంటూరు

బాధితురాలితో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

గుంటూరు నగరానికి చెందిన గిరిజన మహిళ కేతావత్ రోజాబాయిపై ఇద్దరు వ్యక్తులు అనుచితంగా ప్రవర్తించి దాడి చేయటం అమానుషమని, ఇటువంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీస్ అధికారులు, జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. గుంటూరు మిర్చియార్డులో దాడికి గురైన గిరిజన మహిళ కేతవత్ రోజాబాయిని స్థానిక నల్లచెరువు సమీపంలోని వర్కర్స్ కాలనీ రెండో లైనులో అమె నివాసంలో వడిత్యా శంకర్ నాయక్ శనివారం పరామర్శించారు. సంఘటన జరిగిన వివరాలను తెలుసుకొని, నమోదు చేసిన కేసు పురోగతి గురించి పోలీసు అధికారులతో మాట్లాడారు. బాధితులు అధైర్యపడవద్దని, గిరిజనులపై దాడులకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన శిక్షలు అమలు జరిగేలా రాష్ట్ర ఎస్టీ కమిషన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవటానికి ప్రభుత్వం రూ.2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిందని, మొదటి విడత రూ.50 వేలుకు సంబంధించి ప్రోసిడింగ్స్ జిల్లా యంత్రాంగం అందించిందని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం.ప్రభాకర్‌రెడ్డి, డీఎస్పీ మహబుబ్‌బాషా, తహశీల్దారు నగేష్, నల్లపాడు సిఐ రాంబాబు, స్థానిక కార్పొరేటరు వి.జ్యోతిపద్మజ పాల్గొన్నారు.